సాక్షి అనకాపల్లి

శనివారం । 25 । నవంబర్ । 2023



తీరం పరిశుభ్రం

కొమ్మాది: బీచ్ క్లీనింగ్ యంత్రాలతో తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు.



సముద్రానికి విష్ణు హారతి

విశాఖ: లోక కల్యాణార్థం ఆర్కే బీచ్ సమీపంలో ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి విష్ణు హారతి ఇచ్చారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజుల్లో రెండు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న 2, 26న 4 మి.మీ. వర్షపాతం, 33.6 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

స్కూల్ ఆటోలు తనిఖీ

- ఆరు కేసులు నమోదు
- రూ.40,600 జరిమానా వసూలు



రింగ్‌రోడ్డులో ఆటో తనిఖీ చేస్తున్న ఎంవీఐ శిరీష

అనకాపల్లి టౌన్: పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూలు ఆటోలపై ఉక్కుపాదం మోపుతామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజన్న, మురళీకృష్ణ, శిరీష చెప్పారు. పలు ప్రాంతాల్లో శుక్రవారం పాఠశాల వాహనాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 ఆటోలపై కేసులు నమోదు చేసి రూ.40,600 జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలని, పాఠశాలల విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించిన ఆటోడ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మరో ఆటోకు జరిమానా

నక్కపల్లి: ఉపమాక రోడ్డులో నక్కపల్లి ఎస్‌ఐ విభీషణ్‌రావు శుక్రవారం తనిఖీలు నిర్వహించి, విద్యార్థులను తరలిస్తున్న ఆటోకు ఎలాంటి రికార్డులు లేకపోవడాన్ని గుర్తించారు. లైసెన్స్ కూడా లేకపోవడంతో కేసు నమోదు చేసి ఆర్టీవోకు రిఫర్ చేశారు. ఈ ఆటోకు రూ.6,200లు అపరాధ రుసుము విధించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నేడు

తుమ్మపాల: జిల్లాలోని మూడు మండలాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర శనివారం జరగనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాడుగుల మండలం గొట్టివాడ అగ్రహారం, చింతలూరు, అనకాపల్లి మండలం బట్లపూడి, శంకరం, యలమంచిలి మండలం ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్ర ద్వారా భారత ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అర్థమయ్యే రీతిలో దృశ్య శ్రవణ ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. విజయగాథలు, ప్రకృతి వ్యవసాయం, భూములకు సంబంధించిన లక్షణాలు యాత్రలో వివరిస్తారని, సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నూకాంబిక హుండీ లెక్కింపు

- 68 రోజుల హుండీ ఆదాయం రూ.23.97 లక్షలు



అమ్మవారి హుండీ లెక్కింపు దృశ్యం

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. దేవాలయానికి 68 రోజుల్లో రూ.23 లక్షల 96 వేల 658లు, 30 గ్రాముల బంగారం, 1.2 కిలోల వెండి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి నవంబర్ 24 వరకు వచ్చిన కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బద్దా నర్సింగరావు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మళ్లవరపు ఈశ్వరరావు, అర్చకులు యానమండ్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి సింహగిరిపై వరుణ జప హోమం

సింహాచలం : సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు వరుణ జప హోమం నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 27 సాయంత్రం 5 గంటలకు జప సంకల్పం, రుత్విక్ వరణం, 28న గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశస్థాపన, రుద్రాభిషేకం, వరుణ జపం తదితర పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తారు.

మిలీనియం టవర్స్‌లో మినీ సెక్రటేరియట్!

- రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయం
- పలు విభాగాల కార్యాలయాలకు భవనాల ఎంపిక
- పెందుర్తి నుంచి ఎండాడ వరకూ..
- కీలక విభాగాలకు భవనాల కేటాయింపు షురూ
- నీతిఆయోగ్ గ్రోత్‌హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సీఎం వైఎస్ జగన్ నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- రాష్ట్ర కమిటీ అందించిన నివేదిక ప్రకారం నిర్ణయం



మిలీనియం టవర్స్

మిలీనియం టవర్స్ కేంద్రంగా..

రుషికొండలోని ఐటీటవర్స్‌లో టవర్–బీని తూతూ మంత్రంగా నిర్మాణం చేసి టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఈ బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భుజానికెత్తుకుంది. టవర్–బీని పూర్తిస్థాయిలో నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.65.12 కోట్లు ఖర్చవుతుందని ఏపీఐఐసీ అధికారులు నివేదిక అందించారు. 2020 నుంచి విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ మిలీనియం టవర్–బీని ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మంత్రులు, సీనియర్ అధికారుల సమీక్ష సమావేశాలకు ఈ భవనాన్ని వినియోగించనున్నారు. సొంత భవనాల్లేని ప్రధాన శాఖలకు కూడా ఈ భవనాన్ని కేటాయించనున్నారు. ప్రస్తుతం మిలీనియం టవర్–ఏ,బీల్లో 1.75 లక్షల చ.అడుగుల విస్తీర్ణం ఖాళీగా ఉంది. వీటన్నింటిలో పలు శాఖలు సర్దుబాటు కానున్నాయి.



పిఠాపురం కాలనీలో వీఎంఆర్‌డీఏ భవనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

నీతి ఆయోగ్ గ్రోత్ హబ్‌లో చోటు దక్కించుకున్న విశాఖ కేంద్రంగా అధికార కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. మిలీనియం టవర్స్ ఇక నుంచి మినీ సెక్రటేరియట్‌గా సేవలందించనుంది. రుషికొండలోని టూరిజం ప్రాజెక్టు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా మారనున్నట్టు తెలుస్తోంది. అటు పెందుర్తి నుంచి ఇటు ఎండాడ వరకూ వివిధ రాష్ట్ర స్థాయి కార్యాలయాలు ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం సమీక్షకు కేంద్రంగా మారనున్నాయి. వాస్తవానికి నవ్యాంధ్రలోని నగరాలతో పోలిస్తే.. విశాఖ విశాలమైన, ప్లాన్డ్ సిటీగా దేశ విదేశీ ప్రముఖులు సైతం కొనియాడారు. భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు.. వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖ వైపు చూసేలా చేస్తున్నాయి. అందుకే నీతీ ఆయోగ్ గ్రోత్ హబ్స్ ఫస్ట్ ఫేజ్‌లో విశాఖ నగరం చోటు దక్కించుకుంది. అభివృద్ధికి కేంద్రంగా రాబోయే నాలుగైదేళ్లలో హైదరాబాద్‌కు దీటుగా ఎదిగేలా విశాఖ నగరం దూసుకుపోయేందుకు ఉన్న అభివృద్ధి అవకాశాల్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృందం.. విశాఖ నుంచి పరిపాలన సాగించేందుకు సిద్ధమవుతోంది. ఆర్థిక వృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల అందించిన నివేదిక ప్రకారం సీఎం పరిపాలన కార్యాలయంతో పాటు కీలక శాఖలకు క్యాంపు కార్యాలయాల్ని గుర్తించారు.

ఏ శాఖ కార్యాలయం ఎక్కడంటే...!

నగరంలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో మొత్తం 2,27,287 చ.అడుగులు గుర్తించి ఆయా శాఖలకు కేటాయించారు. మొత్తం 35 శాఖలుండగా.. వీటిలో ఇప్పటి వరకూ 16 శాఖలకు భవనాలను గుర్తించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు అందుబాటులో ఉండేలా భవనాల్ని ఎంపిక చేశారు. పెందుర్తి, మద్రిపాలెం, కంచరపాలెం, రామ్‌నగర్, మహారాణిపేట, మద్దిలపాలెం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, సిరిపురం, దుర్గానగర్, ఎంవీపీ కాలనీ, దయాళ్‌నగర్, హనుమంతువాక, ఎండాడ, భీమిలి వరకూ ఉన్న ప్రభుత్వ భవనాలను కేటాయించారు. మిగిలిన 19 శాఖలకు భవనాల గుర్తింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఏయే శాఖలు ఎక్కడ రానున్నాయంటే...

- ఎండాడలోని ఎన్‌వీపీ లా కళాశాల రహదారిలో వ్యవసాయ, సహకార శాఖ కార్యాలయం రానుంది. ఇక్కడ ఉన్న వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం, రీజినల్ కోడింగ్ సెంటర్ ల్యాబ్‌లను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంగా ఎంపిక చేశారు. ఈ రెండు భవనాలు 3 వేల చ.అడుగులు విస్తీర్ణంలో ఉన్నాయి. అదేవిధంగా కోఆపరేటివ్ శాఖ కార్యాలయంగా మద్రిపాలెంలో 4 అంతస్తుల్లో 20 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆప్కాబ్ రిజర్వుడ్ భవనాన్ని గుర్తించారు.
- పశుసంవర్ధక, మత్స్యశాఖ కార్యాలయాలను కూడా ఎంపిక చేశారు. వీటికోసం హనుమంతువాకలో 2 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ఆదర్శనగర్‌లో ఉన్న రీజినల్ ట్రైనింగ్ కేంద్రాన్ని గుర్తించారు.
- ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈఎఫ్ఎస్ అండ్ టీ) దయాల్‌నగర్ కాలనీలో డా.ఎన్టీఆర్ రోడ్ బీచ్‌రోడ్‌లో ఉన్న ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌ని ఎంపిక చేశారు. 13 వేల చ.అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ భవనంలో ఉన్న నాలుగు గదులను ఉన్నతాధికారుల నివాసానికి వినియోగించనున్నారు.
- వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయాలు, ఉన్నతాధికారుల నివాసాలకు విమ్స్‌లో ఉన్న కొన్ని భవనాల్ని కేటాయించారు. 4 వేల చ.అడుగులున్న రీజినల్ డ్రగ్ స్టోర్, 8 వేల చ.అ. ఉన్న జాయింట్ డ్రగ్ కంట్రోల్ ఆఫీస్‌తో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలో ఉన్న కొన్ని పాత భవనాలను ఆధునికీకరించి వినియోగించనున్నారు. అదేవిధంగా ఉన్నతాధికారుల నివాస ప్రాంతంగా విమ్స్‌లో ఉన్న కొన్ని స్పెషల్‌రూమ్స్‌ను గుర్తించారు.
- హోంశాఖ క్యాంపు కార్యాలయం కేజీహెచ్ డౌన్‌లోని కృష్ణానగర్‌కి రానుంది. ఇక్కడ ఉన్న జిల్లా, ప్రాంతీయ అగ్నిమాపక కార్యాలయాన్ని హోం శాఖకోసం గుర్తించారు. ఈ భవనంలో ఒక అంతస్తు ప్రస్తుతం ఖాళీగా ఉంది.
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యాలయంగా కంచరపాలెంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ని ఎంపిక చేశారు. 2500 చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీఐఐసీ జోనల్ ఆఫీస్, 2 వేల చ.అడుగుల కంచరపాలెం ఎస్టేట్‌ని వినియోగించనున్నారు.
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో ఉన్న వివిధ శాఖలకు 7 భవనాలను ఎంపిక చేశారు. 27,345 చ.అడుగుల విస్తీర్ణంలో ముడసర్లోవ సమీపం దుర్గానగర్‌లో ఉన్న జీవీఎంసీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు 9146 చ.అడుగుల రామ్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని 2,219 చ.అడుగుల న్యూ షాపింగ్ కాంప్లెక్స్, చినముషిడివాడలో 54,083 చ.అడుగుల విస్తీర్ణం గల వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం, పిఠాపురం కాలనీలో 24,109 చ.అడుగులున్న వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌ను గుర్తించారు. వీటితో పాటు వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఖాళీగా ఉన్న 32,540 చ.అడుగుల విస్తీర్ణాన్ని కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఉపయోగించనున్నారు.
- పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కైలాసగిరి సమీపంలో 8 వేల చ.అడుగులతో ఉన్న 6 యూనిట్స్ ఉన్న గెస్ట్ హౌస్‌ను గుర్తించారు.
- పాఠశాల విద్య కార్యాలయంగా భీమిలిలో 2,994 చ.అడుగుల విస్తీర్ణంలో డైట్ కళాశాలలో ఉన్న భవనాన్ని ఎంపిక చేశారు.
- వీఎంఆర్‌డీఏ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఖాళీగా ఉన్న కొంత భాగాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ శాఖకు కేటాయించారు.
- మద్రిపాలెంలోని ఆర్ అండ్‌బీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న 4 వేల చ.అడుగుల విస్తీర్ణంగల 2 ఫ్లోర్లు, గంభీరంలోని రవాణా శాఖ కార్యాలయాల్ని రవాణా శాఖ, రహదారులు,భవనాల శాఖ క్యాంపు కార్యాలయాలుగా ఎంపిక చేశారు.
- రుషికొండ ప్రధాన రహదారిలో ఉన్న ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ని మిగతా 10వ పేజీలో ▶

గ్రోత్ హబ్ దిశగా..

రెండేళ్ల క్రితం నీతి ఆయోగ్ ప్రకటించిన పట్టణ సుస్థిర అభివృద్ధి సూచికలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకును, జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును సాధించిన నేపథ్యంలో.. విశాఖ నగరాన్ని గ్రోత్‌హబ్ పైలట్ సిటీగా ఎంపిక చేశారు. సహజ వనరులతో పాటు రైల్వే కనెక్టవిటీ, పోర్టు కనెక్టవిటీతో పాటు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతున్న నేపథ్యంలో గ్రోత్ హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది. ఈ తరుణంలో విజన్ ఫర్ వైజాగ్ సిటీ పేరుతో దీనికి సంబంధించిన ఆర్థిక, అభివృద్ధి ప్రణాళికలపై నీతి ఆయోగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి, అవకాశాలపై నిరంతరం అధ్యయనం చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే.. సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల ముఖ్య అధికారుల క్యాంపు కార్యాలయాలకు భవనాలను ఎంపిక చేశారు.



వీఎంఆర్‌డీఏ భవనం



రామ్‌నగర్‌లో వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధే ధ్యేయంగా..

దశాబ్దాలుగా వెనకబాటుతనానికి గురై అభివృద్ధికి నోచుకోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేపట్టినప్పటినుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. నీతి ఆయోగ్ గ్రోత్‌హబ్ జాబితాలో విశాఖ ఎంపిక కావడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అందుకే దీనికి సంబంధించిన అంశాలను స్వయంగా విశాఖ నుంచే సమీక్షించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల క్యాంపు కార్యాలయాలకు సంబంధించిన భవనాల ఎంపికపై కసరత్తు చేశారు. కేవలం విశాఖ మాత్రమే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ సమతులాభివృద్ధి చెందేలా క్షేత్ర స్థాయిలో సమీక్షల్ని సీఎం వైఎస్ జగన్ విశాఖ నుంచి నిర్వహించనున్నారు.

ఏయూలో కింగ్ సందడి





అభిమానులకు అభివాదం చేస్తున్న నాగార్జున, చిత్రంలో అక్కినేని అఖిల్

ఏయూక్యాంపస్: ఆంధ్రయూనివర్సిటీలో కింగ్ నాగార్జున, అందాల నటుడు అఖిల్ సందడి చేశారు. ఏయూలో ఆధునికీకరించిన ఆరుబయలు రంగస్థలం–ఆస్కిన్ స్క్వేర్ పునఃప్రారంభానికి వచ్చిన అక్కినేని హీరోలకు ఘనస్వాగతం లభించింది. ముఖ్యంగా అఖిల్‌ను చూసేందుకు విద్యార్థినులు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా అక్కినేని నటులను చూడగానే విద్యార్థినులు కేరింతలు కొట్టారు. సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశారు. వేలాదిగా విద్యార్థులు తరలిరావడంతో ప్రాంగణం నిండిపోయింది. దీంతో విద్యార్థులు జువాలజీ విభాగం భవనం మొదటి, రెండో అంతస్థలపైకి చేరుకుని అక్కడ నుంచి తమ అభిమాన నటుడిని వీక్షించారు. విద్యార్థుల అభిమానానికి కింగ్ నాగార్జున ఎంతో సంతోషానికి లోనయ్యారు. సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ శివ సినిమాలోని బోటనీ పాఠముంది...మేటనీ ఆట వుంది అంటూ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు

- ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి
- 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదు కావాలి
- అవగాహన ర్యాలీలో డీఆర్వో దయానిధి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో దయానిధి



నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధంలాంటిదని, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించిందని డీఆర్వో దయానిధి అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు సాగిన అవగాహన ర్యాలీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి వరకు ఓటరుగా నమోదు చేసుకోలేని వ్యక్తులు దగ్గరలో ఉన్న బీఎల్వోలను సంప్రదించాలని ఆయన కోరారు. రానున్న స్వార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్డీవో చిన్నికృష్ణ మాట్లాడుతూ ఓటరు లిస్టులో పేర్లు సరిచూసుకోవాలని, మార్పులు చేర్పులు ఉన్నట్లయితే సంబంధిత శాఖాధికారులను సంప్రదించాలని కోరారు.

డిసెంబర్ 27 నుంచి ఓటరు జాబితా తయారు చేసి వచ్చే ఏడాది జనవరి 5వ తేదీలోగా పూర్తి ఓటరు లిస్టును రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. గ్రామాల్లో ఓటు హక్కుపై దశలవారీగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపడతామన్నారు. రింగ్ రోడ్డులో ప్రారంభమైన ర్యాలీ పెరుగుబజార్ జంక్షన్, మల్లవరపువీధి, వేల్పులవీధి జంక్షన్ మీదుగా నెహ్రూచౌక్ చేరుకుని అక్కడ మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.సుబ్బరాజు, జెడ్పీ ఎస్.వెంకటరమణ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, వాకర్స్ తదితర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ విధులపై సమీక్ష



జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: పౌర సరఫరాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి విజిలెన్స్ సంఘ సభ్యులను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సంఘ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పౌర సరఫరాలు, గ్యాస్, పెట్రోలు, రేషన్ కార్డులు, సినిమా హాళ్లలో వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలు, వీలైతే వాటి పరిష్కార మార్గాలను తెలపాలన్నారు. పౌర సరఫరాల విధి విధానాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వంటగ్యాస్ సరఫరా, అధిక ధరలకు మార్కెట్లో సరకుల అమ్మకం, సినిమా హాళ్లలో తినుబండారాలు, పార్కింగ్ ఫీజుల దోపిడీ, వికలాంగులకు ర్యాంపుల ఏర్పాటు, ఖాళీగా ఉన్న డీలర్ పోస్టుల భర్తీ, ఆదిమ గిరిజన తెగల(పీటీజీ)కు ఉచిత రేషన్ అందకపోవడం తదితర సమస్యలను విజిలెన్స్ కమిటీ సభ్యులు తెలిపారు. వీటిపై చర్యలు తీసుకుంటామని ఆమె భరోసానిచ్చారు. జీవో ఎంఎస్ నెంబర్ 35 సీఏఎఫ్, సీఎస్ – 2007 ప్రకారం మునగపాక మండలం టి.సిరసపల్లి గ్రామం షాపు నెం.0334518 పరిధిలో 918 కార్డులు ఉండగా నిబంధనల మేరకు విభజన ప్రతిపాదనను సభ ఆమోదించింది. సమావేశంలో డీఎస్‌వో కేవీఎల్ఎన్ మూర్తి, పౌరసరఫరాల డీఎం పి.జయంతి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సభ్యులు ఎస్వీ గిరిబాబు, జర్నలిస్టులు జి.కాంతారావు, సీహెచ్‌బీఎల్ స్వామి, పీఎస్‌టీ పట్నాయక్‌లు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లిటౌన్: సేంద్రియయ విధానంలో సాగు చేసిన ఆహార ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో గత 10 రోజులుగా శాస్త్రవేత్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన శాస్త్రవేత్తలు ఆ ఫలాలను రైతులకు చేరవేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని విశ్రాంత శాస్త్రవేత్త కె.వీరభద్రరావు సూచించారు.

సేంద్రియ ఆహార ఉత్పత్తుల ఎగుమతులు భవిష్యత్తులో మరింతగా పెరిగే అవకాశముందని జిల్లా ఉద్యానవన అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. అంతకు ముందు శిక్షణ పొందిన శాస్త్రవేత్తలకు ధ్రువీకరణపత్రాలు, మెమెంటోలు జగన్నాథరావు అందించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి, శాస్త్రవేత్తలు ఎంబీజీఎస్ కుమారి, సీహెచ్ ముకుందరావు, ఎ.శిరీష పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలకు తేజస్విని



నర్సీపట్నం:ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి బాక్సింగ్ పోటీలకు నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని ఎంపికైనట్టు బాక్సింగ్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ నెల 23న ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో యర్రా తేజస్విని ప్రథమస్థానంలో నిలినట్టు చెప్పారు.

దుర్గాదేవి ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

నక్కపల్లి: మండలంలో కాగిత గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి బంగారు ముక్కుపుడక, 50 తులాల వెండి కిరీటం, 60 తులాల వెండి హారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ చోరీ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విభీషణ రావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

అనకాపల్లి టౌన్: వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రెండు కేజీల గంజాయి లభ్యమైనట్లు పట్టణ క్రైం ఎస్ఐ సింహాచలం శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం .. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బురదగుట్ట గ్రామానికి చెందిన జాఫర్, కోరా గోవింద్ రైల్వే స్టేషన్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మిలీనియం టవర్స్‌లో మినీ సెక్రటేరియట్!

▶ 9వ పేజీ తరువాయి

గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించారు. ఈ భవనాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంగా కూడా ఎంపిక చేసే అవకాశం ఉంది.

- రెవెన్యూ శాఖ కార్యాలయాలుగా సింహాచలంలోని దేవదాయ శాఖ భవనాలతో పాటు విజయనగరంలోని డిజాస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎంపిక చేశారు.
- పెదవాల్తేరు ఆంధ్ర విశ్వ విద్యాలయం నార్త్ క్యాంపస్‌లో 10,300 చ.అడుగుల్లో ఉన్న ఓల్డ్ గెస్ట్ హౌస్‌ని ఆధునికీకరించి జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కేటాయించనున్నారు. అదేవిధంగా దానికి సమీపంలో ఉన్న ఉత్తర కోస్తా చీఫ్ ఇంజినీర్ భవనంతో పాటు పెదవాల్తేరులో ఇదే శాఖకు చెందిన 37,500 చ.అడుగుల మూడంతస్తుల కొత్త భవనాన్ని కార్యాలయాలుగా గుర్తించారు. పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ కార్యాలయాలుగా ఆర్అండ్‌బీలో మహిళా మండలి ఎదురుగా 1500 చ.అడుగులు, 3 వేల చ.అడుగుల అక్కిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్, 7200 చ.అ. విస్తీర్ణం గల కేవీకే స్టేడియం ఆఫీస్‌ని ఎంపిక చేయగా రెసిడెన్స్‌గా బీచ్‌రోడ్డులోని హరిత రిసార్టును గుర్తించారు.

మరో 19 శాఖలకు గుర్తించే పనిలో..

వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖకు వచ్చే అవకాశాలున్నందున ఈలోపే మిగిలిన శాఖలకు భవనాలు గుర్తించేందుకు రాష్ట్ర, జిల్లా కమిటీలు అన్వేషణ సాగిస్తున్నాయి. బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, మహిళా శిశు సంక్షేమం, ఇంధనశాఖ, ఆర్థికశాఖ, సాధారణ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ, ఐటీ, కార్మిక శాఖ, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, ప్లానింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, సోషల్ వెల్ఫేర్, రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ), గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన భవనాలు గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ శాఖల కార్యాలయాలను కూడా సాధ్యమైనంత త్వరలో గుర్తించే పనిలో ఇప్పటికే అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తంగా డిసెంబర్ నెలలో విశాఖ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలు సాగించే వీలు కలగనుందని అర్థమవుతోంది.



జలవనరుల శాఖ అతిథి గృహం



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల శాఖ కార్యాలయం



సింహాచలంలో దేవదాయ శాఖ భవనం



ఎంవీపీలో వీఎంఆర్‌డీఏ నూతన భవనం

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్



పోలీస్‌లకు పట్టుబడిన నేరస్థుడు

రోలుగుంట: గంజాయికేసుతో సంబంధం ఉండీ, పరారీలో ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. పట్టుబడిన వారిలో రోలుగంట మండలం రత్నంపేటకు చెందిన ఒకరు, నర్సీపట్నం నియోజకవర్గం కోటఉరట్లకు చెందిన ఒకరు ఉన్నారని, వీరిద్దర్నీ వేర్వేరు చోట్ల పట్టుకుని, రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎర్రయ్యదొర

- 20 మంది సభ్యులతో నూతన పాలకవర్గం నియామకం



యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బొద్దపు ఎర్రయ్యదొర నియమితులయ్యారు. ఈ మార్కెట్ పాలకవర్గం గడువు ముగియడంతో కొంతకాలంగా పర్సన్‌ఇన్‌చార్జ్‌తోనే కొనసాగుతోంది. ఇటీవల ఎమ్మెల్యే కన్నబాబు యలమంచిలి మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమించాలని సిఫార్సు చేయడంతో ప్రభుత్వం పరిశీలన జరిపి కొత్త పాలకవర్గం నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 20 మంది సభ్యులతో యలమంచిలి మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ జీవో విడుదల చేశారు. ఎమ్మెల్యే కన్నబాబును గౌరవ చైర్మన్‌గా, బొద్దపు ఎర్రయ్యదొరను చైర్మన్‌గా, రాంబిల్లి మండలానికి చెందిన శిరిదెళ్ల శ్రీనివాసరావును వైస్ చైర్మన్‌గా నియమించారు. మున్సిపాలిటీ పరిధి పెదపల్లికి చెందిన బొద్దపు ఎర్రయ్యదొర 2014 నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. తనను మార్కెట్ కమిటీ చైర్మన్ నియమించినందుకు ఎమ్మెల్యే కన్నబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మకు ఎర్రయ్యదొర కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎర్రయ్యదొరకు అభినందనలు తెలిపారు.

నేడు 'పెందుర్తి'లో సామాజిక సాధికార బస్సు యాత్ర

- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైవీ సుబ్బారెడ్డి పిలుపు
- హాజరు కానున్న డిప్యూటీ సీఎంలు, మంత్రులు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత విజయవంతం కావడంతో రెట్టింపు ఉత్సాహంతో రెండో విడత సామాజిక బస్సుయాత్రకు పూనుకున్నారు. ఈ యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించనున్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం పేదలకు చేసిన మోసాన్ని ఎండగట్టనున్నారు. సీఎం వైఎస్ జగన్ కుల, మతాలకతీతంగా అర్హులైన అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమిచ్చారు. చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తున్నారు.

ఈ యాత్రకు స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, ఎంపీ నందిగాం సురేష్,తదితరులు హాజరు కానున్నారు.

బస్సు యాత్ర సాగేదిలా..

- ఉదయం 10.30 గంటలకు పెందుర్తి నియోజకవర్గం వేపగుంట జంక్షన్‌లో సామాజిక సాధికార బస్సు యాత్రకు స్వాగతం
- 10.45 గంటలకు మంత్రుల ప్రెస్‌మీట్
- 11.30 గంటలకు యాత్ర ప్రారంభం. వేపగుంట జంక్షన్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకూ బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతన బ్లాక్ ప్రారంభం. అనంతరం అక్కడి నుంచి వెల్ఫేర్ కళాశాల వరకూ ర్యాలీ. అక్కడే లంచ్ ఏర్పాటు
- మధ్యాహ్నం 3.30 గంటలకు సబ్బవరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ



యాత్ర విజయవంతం చేయండి

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం చేసి బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్క కుటుంబం యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలి

– వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్

సామాజిక బస్సు యాత్ర సభకు స్థల పరిశీలన



బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, బొడ్డేడ ప్రసాద్, తిప్పల గురుమూర్తిరెడ్డి

ఎస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గంలో త్వరలో జరగబోయే సామాజిక బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించే సభ కోసం శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌రావు, నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులు సభావేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాటుకు అడ్డురోడ్డు పాత జాతీయ రహదారి కూడలి అనుకూలమైన ప్రాంతంగా నిర్ణయించారు. బస్సు యాత్ర వచ్చేనెల మొదటి వారంలో ఉండవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, నక్కపల్లి పార్టీ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు దత్తుడు సీతబాబురాజు, శ్రీపతిరాజు, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కశింకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాల నిర్మాణానికి ఏర్పాట్ల పరిశీలన

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయాన్ని రూ.కోటి వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. అభివృద్ధి పనులకు శనివారం ఉదయం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి దంపతులు శంకుస్థాపన చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రెండు కల్యాణ మండపాలు, ప్రహరీ నిర్మించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిధులతోపాటు దాతల నుంచి విరాళాలు సేకరించి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు.

ఫిల్మ్ క్లబ్ మెంబర్‌గా ధర్మశ్రీ



హైదరాబాద్‌లో ఎఫ్‌ఎన్‌సీపీ మెంబర్‌గా నామినేట్ చేస్తూ కార్డును అందజేస్తున్న కల్చరల్ సెంటర్ ప్రతినిధి, సినీ నిర్మాత ఆదిశేషగిరిరావు

చోడవరం: హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ) మెంబర్‌గా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నామినేట్ అయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎఫ్‌ఎన్‌సీసీ ప్రతినిధులు, ప్రముఖ సినీ నిర్మాత ఆదిశేషగిరిరావు శుక్రవారం ఆయనకు నామినేట్ కార్డును అందజేశారు. ఎఫ్‌ఎన్‌సీసీలో మెంబర్‌గా అవకాశం దక్కడం ఆనందంగా ఉందని ధర్మశ్రీ అన్నారు. ఫిల్మ్ సెంటర్ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. కళాకారుడైన ధర్మశ్రీ పలు చలనచిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.

గోవాడ సుగర్స్‌లో సెంట్రిఫ్యూగల్ యంత్రం ప్రారంభం



సుగర్ ఫ్యాక్టరీలో సెంట్రిఫ్యూగల్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు సన్నాహాలు మొదలయ్యాయి. మరో మూడు వారాల్లో క్రషింగ్ ప్రారంభించేందుకు యాజమాన్యం అన్ని చర్యలు చేపట్టింది. ఫ్యాక్టరీ బాయిలర్ హౌస్‌లో ఉన్న సెంట్రిఫ్యూగల్ మిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు ఈ యంత్రానికి పూజ చేసి స్విచ్‌ఆన్ చేసి వినియోగంలోకి తెచ్చారు. మరో పక్క క్రషింగ్ ప్రారంభించే సమయం దగ్గర పడుతుండటంతో ఓవరాయిలింగ్ పనులతోపాటు పక్వానికి వచ్చిన చెరకు తోటలకు రసనాణ్యత పరీక్షలు చేసేందుకు కూడా ల్యాబ్‌లను సిద్ధం చేస్తున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

కొమ్మాది: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెల్త్ అడ్వైజర్ వినీత శ్రీవాత్సవ్ సూచించారు. 'ఆంధ్రరాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ అనీమియా' అంశంపై రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. ఈ వ్యాధిపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించడం, నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందేలా చూడటం తదితర అంశాలపై ఆరోగ్యసిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



రైల్వేట్రాక్‌పై మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శాంతారాం

అనకాపల్లిటౌన్: యలమంచిలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి శుక్రవారం మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారాం చెప్పారు. మృతదేహాన్ని గ్యాంగ్‌మెన్ గమనించి స్థానిక స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారని, అక్కడి నుంచి అందిన సమాచారం మేరకు శారదానది రైల్వేబ్రిడ్జి వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినట్టు ఎస్ఐ తెలిపారు. బ్లూకలర్ జీన్స్‌ఫ్యాంట్, ముదురు ఆకుపచ్చ గళ్లచొక్కా మృతుడు ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. వివరాల కోసం 7673906010 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మేలు జాతి పశువుల పెంపకాన్ని కృషి

- పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కరుణాకరరావు, జిల్లా పశువైద్యాదికారి ప్రసాదరావు.



పోటీలకు తీసుకువచ్చిన లేగదూడలను పరిశీలిస్తున్న ప్రసాదరావు

కె.కోటపాడు: మేలు జాతి పశువుల పెంపకానికి పాడిరైతులు కృషి చేయాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కరుణాకరరావు, అనకాపల్లి జిల్లా పశువైద్యాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. చౌడువాడలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏడాది లోపు లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. 45 పెయ్యిలను వాటి పెంపకందారులు ప్రదర్శనకు తీసుకువచ్చారు. వీటిలో ఆరోగ్యకరమైన పశుపోషణ కలిగి మొదటి మూడు స్థానాలలో నిలిచిన పెయ్యిల పెంపకందారులకు బహుమతులను అందించారు. వీటితో పాటు ప్రదర్శనకు తీసుకువచ్చిన పెయ్యిల పెంపకం దారులకు కన్సోలేషన్ బహుమతులను కరుణాకరరావు, ప్రసాదరావు అందించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థకార్యనిర్వహణాదికారి బి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని 30 ప్రాంతాల్లో ఈ ఏడాది లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి మాట్లాడుతు రైతులకు 60 శాతం రాయితీపై టీఎంఆర్ దాణాను అందిస్తున్నట్టు చెప్పారు.

ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు సంధ్య, సీహెచ్.వై.నాయుడు, మౌనిక, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, ఆళ్ళ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా చిలుకు ద్వాదశి ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న ఆడారి నూకయ్య కుటుంబ సభ్యులు



చిమ్మిడిని దంచుతున్న అర్చకులు, పాల్గొన్న ఈవో దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

- స్వామి సేవలో తరించిన అనకాపల్లికి చెందిన ఆడారి నూకయ్య వంశీయులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం చిలుకు ద్వాదశి ఉత్సవం విశేషంగా జరిగింది. అనకాపల్లికి చెందిన ఆడారి నూకయ్య వంశీయులు తరలివచ్చి ఈ ఉత్సవాన్ని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి జరిపించారు. ఏటా కార్తీక ద్వాదశి రోజున ఆలయంలో చిలుకు ద్వాదశి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవంలో పాలు పంచుకునే అవకాశాన్ని తరతరాలుగా అనకాపల్లిలోని గవర సామాజిక వర్గానికి చెందిన ఆడారి నూకయ్య కుటుంబీకులుకు దేవస్థానం కల్పిస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ఆడారి నూకయ్య కుటుంబీకులు పూజా ద్రవ్యాలు తీసుకొచ్చారు. సాయంత్రం ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు, శయన పెరుమాళ్లు, ఆళ్వారులను మండపంలో అధిష్టింపజేశారు. స్వామి చెంతన నువ్వులు, బెల్లం, పాలు రోట్లో వేసి చెరకు గెడలతో శాస్త్రోక్తంగా దంచారు. తయారైన చిమ్మిడిని స్వామికి నైవేద్యంగా ఆరగింపు చేశారు. తదుపరి శయన పెరుమాళ్లకు బేడా తిరువీధి నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు పాల్గొన్నారు.

వీఆర్వోపై దురుసుగా ప్రవర్తించిన ఇసుక తవ్వకం దారులు

కోటవురట్ల: పందూరు గ్రామంలో ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలను గురువారం రాత్రి అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీఆర్వో ఆశపై తవ్వకం దారులు తిరుగబడి దురుసుగా ప్రవర్తించారు. దీంతో తహసీల్దార్ జానకమ్మకు వీఆర్వో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్.. ఎస్ఐ నారాయణరావుకు సమాచారం అందజేసి, విచారణ జరపాలని ఆదేశించారు. అనంతం విలేకరులతో తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సంఘటనపై వీఆర్వో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారని చెప్పారు.

మద్యం మత్తులో ఉన్న ట్రాక్టరు డ్రైవర్లు దురుసుగా ప్రవర్తించి, అనంతరం గ్రావెల్‌ను అక్కడే వదిలి ట్రాక్టర్లను పట్టుకుపోయారని తెలిపారు. బాధ్యులను గుర్తించి, కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీ కల్యాణోత్సవం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక లక్ష్మీదేవిపేట గౌరీపరమేశ్వరుల ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈనెల 11న జరిగిన అమ్మవారి నిలుపు మహోత్సవంలో భాగంగా కల్యాణ వేడుకలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బూడిద నాగేశ్వరావు చెప్పారు. డిసెంబర్ 9న అమ్మవారి అనుపు మహోత్సవం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో సభ్యులు ముప్పన లింగేశ్వరరావు, జానా సూరిబాబు, జానా లోకేష్, దేశెట్టి నారాయణరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ 10న

తుమ్మపాల: డిసెంబర్ 10న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ చైర్మన్ కె.సుమన్, ఏపీజేఏసీ అమరావతి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి లోవరాజు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకుడు ఉప తహసీల్దార్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సభలో రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం, రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరగనుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గురునాథ్, జిల్లా అధ్యక్షుడు జగపతిబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు టి.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన ఏకాహం



గవరపేటలో ఊరేగించిన కలశాన్ని శారదా నదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేట శారదా గణపతి రామాలయంలో ఏకాహం కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. కార్తీక మాసం తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం హరి నామస్మరణతో ఏకాహం 24 గంటల భజన ప్రారంభించిన విషయం తెలిసిందే. కార్యక్రమం శుక్రవారంతో ముగియడంతో భజన ప్రారంభంలో ఏర్పాటుచేసిన కలశానికి పూజలు చేసి వీధుల్లో ఊరేగించి స్థానిక శారదానదిలో సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. అనంతరం ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా హాజరయ్యారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 2,208 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,280	4,480
మొదటి రకం	3,900	4,380
రెండో రకం	3,640	4,050
మూడో రకం	3,340	3,690

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1యూనిట్, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అంగన్‌వాడీలు.. పౌష్టికాహార నిలయాలు

సీఎం జగన్ ప్రభుత్వంలో 'పోషణ' ఫుల్

తల్లీ బిడ్డల సంరక్షణే ధ్యేయంగా చర్యలు

నాడు దైన్యం టీడీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలు అలంకార ప్రాయమే. భవనాల శ్లాబ్‌లు పెచ్చులూడుతూ.. ఎప్పుడు కూలిపోతాయోనని భయం వెంటాడేది. పిల్లల్ని గదుల్లోకంటే ఆరుబయటే కూర్చోబెట్టాల్సి వచ్చేది. చెట్ల కిందే భోజనాలు. ఆ భోజనాలు కూడా తినే పరిస్థితి ఉండేది కాదు. అంగన్‌వాడీలకు చిన్నారులను పంపాలంటే తల్లిదండ్రులకు భయం.

నేడు ధైర్యం సీఎం జగన్ ప్రభుత్వంలో అంగన్‌వాడీలు ప్రీ(ఫౌండేషన్) స్కూళ్లుగా మారాయి. పిల్లలకు స్మార్ట్ టీవీల ద్వారా ఆటపాటలు, బోధన. అంతర్జాతీయ స్థాయి కరికులమ్‌తో పాఠ్యపుస్తకాలు. పిల్లలకు అందించే పోషకాహారమైతే.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఇళ్లల్లో అందించలేనంత గొప్పగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతల సంరక్షణలో మన అంగన్‌వాడీలే ఆదర్శం.



నా పేరు సుజాత. మాది కుంచంగి గ్రామం. రెండేళ్ల క్రితం పెళ్లయింది. ప్రస్తుతం గర్భవతిని. ఏదో నెల. రక్తపరీక్షలు చేసినపుడు వంట్లో రక్తం తక్కువగా ఉందని డాక్టర్లు చెప్పారు. ఆ వివరాలను అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పారట. అప్పటి నుంచి నా మీద ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వాళ్లు చెప్పినట్లే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో ఉన్న ఆహార పదార్థాలను వండుకుని తింటున్నా. నాకూ, నా కడుపులో ఉన్న బిడ్డకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నారు. ఈ మధ్యనే సీమంతం కూడా చేశారు. చాలా సంతోషం అనిపించింది.

ఇంటికే డ్రై రేషన్ పంపిణీ

పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కొక్కరికి రూ.850, సంపూర్ణ పోషణ ప్లస్‌లో రూ.1,150 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషణ కిట్లను తీసుకోవాల్సి వచ్చేది. గర్భిణులు, బాలింతల ఇబ్బందుల నేపథ్యంలో సీఎం జగన్ ఆదేశాలతో లబ్ధిదారుల ఇంటికే పోషణ కిట్లను అందించే ఏర్పాట్లు చేశారు. బాలలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది.

మండల, పట్టణ పరిధిలో లబ్ధిదారులు

గర్భిణులు	732
బాలింతలు	519
7 నెలలు-3 ఏళ్ల పిల్లలు	1,123
3 నుంచి 6 ఏళ్ల పిల్లలు	3,447



నాడు-నేడు పథకంలో నిర్మిస్తున్న గోపాలపురం అంగన్‌వాడీ భవనం

అనకాపల్లిటౌన్: బాలలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే రేపటి సమాజం బాగుంటుంది. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీలకు సొంత భవనాలు సమకూర్చారు. అంగన్‌వాడీలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన ఆసరాగా మార్చారు.



అంగన్‌వాడీలోనే వ్యాక్సిన్లు



గర్భిణిగా ఉన్న సమయంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఎన్నో లాభాలు పొందాను. ప్రస్తుతం డెలివరీ అయింది. బిడ్డకు వ్యాక్సిన్ల కోసం పట్టణానికి వెళ్లాల్సిన పని లేదు. అంగన్‌వాడీ కేంద్రంలోనే అన్ని వ్యాక్సిన్లు వేస్తున్నారు. వారంవారం ఏఎన్‌ఎంలు అంగన్‌వాడీకి వచ్చి, మా తల్లీబిడ్డల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు.

– జె.రత్నకుమారి, బాలింత, తుమ్మపాల



మామిడిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న టీచర్

19 రకాల ఆట వస్తువులతో ప్రత్యేక కిట్

ఇటీవలే 19 రకాల ఆట వస్తులతో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కో కిట్‌ను ప్రభుత్వం అందజేసింది. ఆ కిట్‌లో చిన్నారులకు ఉపయోగపడే మ్యాట్, సాఫ్ట్ బాల్, చెక్కతో చేసిన నంబర్ పజిల్, పెగ్ బోర్డు, అబాకస్, చెక్క బూట్లు, బిల్డింగ్ బ్లాక్‌లు, గమ్ స్టిక్స్, 25 ముక్కల రంగుల పేపర్లు, 5 సెట్ల వాటర్ కలర్స్, 5 సెట్ల స్కెచ్ పెన్నులు, 5 ప్యాకెట్ల పెన్సిళ్లు, 5 బాక్స్‌ల రబ్బర్లు, 5 షార్ప్‌నర్లు, నమూనాల ట్రేసింగ్ బోర్డు, డాఫ్లి, బ్లోయింగ్ సంగీత వాయిద్యాలు, 20 పలకలు బొమ్మలు చేసేందుకు ఉపయోగపడే 5 సెట్ల మౌల్డింగ్ క్లే, మూడు ప్యాకెట్ల డస్ట్ ఫ్రీ సుద్దముక్కలు, బంతితో బాస్కెట్ బాల్ హోప్, 20 కథల పుస్తకాలు అందించారు.



కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో టీవీ పాఠాలు వీక్షిస్తున్న చిన్నారులు



మారేడుపూడి అంగన్‌వాడీ కేంద్రంలో ఆటలాడుకుంటున్న చిన్నారులు

పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల కోసం

ఏడు మాసాల నుంచి మూడేళ్ల వయసుగల పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను అందిస్తారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారాన్ని వండి పిల్లలకు వడ్డిస్తారు.

పట్టణ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు	81
సొంత భవనాల్లో ఉన్న కేంద్రాలు	57
అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలు	24
మండల పరిధిలో అంగన్‌వాడీలు	84
పట్టణ, మండల పరిధిలో అంగన్‌వాడీలు	165
సొంత భవనాల్లో ఉన్న అంగన్‌వాడీలు	141
నాడు-నేడు కింద కేటాయింపులు	రూ.1.96 కోట్లు
స్మార్ట్ టీవీలు ఏర్పాటైన కేంద్రాలు	84
ఇందుకు వెచ్చించిన సీఎస్సార్ నిధులు	రూ.22 లక్షలు

బాలింతలు, గర్భిణులకు అందించే సరకులు

సరకులు	సంపూర్ణ పోషణ	సంపూర్ణ పోషణ ప్లస్
రాగిపిండి	2 కిలోలు	1 కిలో
అటుకులు	1 కిలో	2 కిలోలు (మల్టీగ్రెయిన్ ఆటా)
బెల్లం	పావు కిలో	అర కిలో
వేరుశనగ చిక్కీ	పావు కిలో	అర కిలో
ఎండు ఖర్జూరం	పావు కిలో	అర కిలో
ఫోర్టిఫైడ్ బియ్యం	3 కిలోలు	3 కిలోలు
పప్పు	1 కిలో	1 కిలో
వంట నూనె	అర లీటర్	అర లీటర్
కోడి గుడ్లు	25	25
పాలు	5 లీటర్లు	5 లీటర్లు



నిదానందొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

అంగన్‌వాడీ మెనూ

సోమ, గురువారాల్లో వేడి అన్నం, వెజిటబుల్ కర్రీ, సాంబారు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు, మంగళ, శుక్రవారాల్లో పౌష్టికాహారంతో పాటు తోటకూర పప్పు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు, బుధ, శనివారాల్లో వెజిటబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 మి.లీ., వారంలో కనీసం రెండు రోజులు మునగాకు తప్పనిసరి.

జగన్‌తోనే బడుగుల సంక్షేమం



బవులవాడలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ సూరిబాబు



సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సుజాత, చిత్రంలో జానకీరామరాజు, రమేష్



ఏఎస్ పేటలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి, తదితరులు

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌ను గెలిపించి మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన స్థానిక అంజయ్యకాలనీలో శుక్రవారం నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. సచివాలయ పరిధిలో రూ.18.37 కోట్ల మేర బడుగు బలహీన వర్గాలకు లబ్ధి చేకూరిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75ఏళ్ల తర్వాత బడుగులకు అత్యధిక సంక్షేమ ఫలాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరించి, కాలనీ వాసులకు బ్రోచర్లు అందించి, వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి జాజుల రమేష్, జెడ్సీ ఎస్.వెంకటరమణ, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, కొండూరు రవీంద్రనాథ్, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బవులవాడలో...

మండలంలోని బవులవాడ గ్రామ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమానికి ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ హాజరై మాట్లాడారు. సచివాలయ పరిధిలో రూ.30.66 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వ లబ్ధి చేకూరిందన్నారు. ఆ వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అంతకు ముందు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి బ్రోచర్లను గ్రామస్తులకు అందించారు. అక్కడే పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవిందు, సర్పంచ్ మజ్జి లక్ష్మి, గ్రామ అధ్యక్షుడు మజ్జి వెంకట అప్పారావు, ఏఎంసీ చైర్మన్ దాడి కుమార్, సచివాలయ కన్వీనర్లు నక్కా రమణ, జె.రామకృష్ణ, బొద్దపు ప్రసాద్, చెక్కల శ్రీను, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో గ్రామాలు అభివృద్ధి పథం వైపు పయనిస్తున్నాయని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని ఏఎస్ పేట సచివాలయంలో శుక్రవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. సచివాలయానికి రూ.20 లక్షల వంతున నిధులు మంజూరు చేసి, అవసరమైన చోట సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత భూసార పరీక్షలను వినియోగించుకోండి

రైతుల అవగాహన సదస్సులో దంతులూరి దిలీప్‌కుమార్



భూసార పరీక్షలపై మాట్లాడుతున్న దంతులూరి దిలీప్‌కుమార్

తుమ్మపాల: సీఎం జగన్ ప్రభుత్వంలో రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేయడంతో, భూమిలో ఉన్న పోషకాలు, ఎరువులు వినియోగంపై వారికి అవగాహన కలుగుతోందని రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలం తుమ్మపాల గ్రామంలో వ్యవసాయ, ఆత్మ ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో అన్ని సేవలు అందించాలనే లక్ష్యంతోనే ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను నిర్మించి, అన్ని రకాల రైతు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రైతులకు మెరుగైన పాల ధరను అందించేందుకు అమూల్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ సేవల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకుంటూ నేల స్వభావాన్ని పరిరక్షించడంతోపాటు, మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరీక్ష ఉపయోగాలు, పరీక్ష ఫలితాల ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాషియం ఏ మోతాదులో వేయాలో వివరించారు. మండల వ్యవసాయాధికారి రంగాచారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలు, రైతులకు కావాల్సిన మినప, పెసర విత్తనాలు ఆర్బీకేలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కావలసిన రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఫార్మర్ ట్రైనింగ్(డీఆర్సీ) వ్యవసాయ అధికారి వి.తులసి రైతులకు అవసరమైన సలహాలు, పంటలకు వచ్చే తెగులు, పురుగులు వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, ఎంపీయూ జానకి పశుసంవర్థక సహాయకులు బి.వెంకట్, సర్పంచ్ బి.పెంటయ్య నాయుడు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్నా, రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

చందన స్వామిగా ధ్యాన వేంకటేశుడు



చందనం పూతలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ద్వాదశి పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామిని చందనంతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ద్వాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులను ఆదుకోవాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ, రైతు సంఘాల నాయకులు

తుమ్మపాల: జిల్లాలో వర్షాభావ పరిస్థితులున్న మండలాలను కరవు మండలాలుగా ప్రకటించేలా చూడాలని కోరుతూ డీఆర్వో బి.దయానిధికి సీపీఐ, కౌలు రైతు సంఘాల ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. సీపీఐ ఆధ్వర్యంలో పలు మండలాల రైతు నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో కరువు ప్రభావం కనిపిస్తోందన్నారు. ఆయా మండలాల రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నీరు లేక దెబ్బ తిన్న పంటలకు రూ.50 నుంచి రూ.75 వేలు, ఉద్యాన పంటలకు రూ.1 లక్ష వరకు నష్టపరిహారం అందించాలన్నారు. ఖరీఫ్‌లో తీసుకున్న రుణాలను మాఫీ చేసి, గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ పనులను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరావు, వియ్యపు రాజు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో చిన్నారుల ప్రతిభ



తాము వేసిన చిత్రాలతో విద్యార్థులు

కశింకోట: స్థానిక బాలికోన్నత పాఠశాలలో క్విట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రకాల చిత్రాలను గీసి అబ్బుర పరిచారు. విజేతలకు శనివారం బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల తెలిపారు. క్విజ్, వ్యాస రచన పోటీలను కూడా శనివారం నిర్వహిస్తామన్నారు.